ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023 5 అనంతపురం

పామిడి సిఐగా రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

పామిడి నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా రాజశేఖర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి బదిలీపై పామిడి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గుత్తిలో కూడా సిఐగా పనిచేశారు. అప్పట్లో కరోనా సమయంలో ప్రజలకు వైరస్ సోకకుండా అవగాహన కల్పించడంలో పాటు నియంత్రణకు ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా సిఐకు ఎస్ఐ చాంద్‌బాషా, సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని సిఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

సామిడి సిఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

జిపిఎస్‌ను అంగీకరించం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. కోటేశ్వరప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సిపిఎస్ స్థానంలో జిపిఎస్ ప్రవేశపెట్టాలనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప స్పష్టం చేశారు. స్థానిక రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్‌లో జరిగిన యుటిఎఫ్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిపిఎస్‌లో కొత్తదనం ఏమీ లేదన్నారు సిపిఎస్ పథకంలోనే కొన్ని మార్పులు చేసి జిపిఎస్‌గా పేరు పెట్టారని అన్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగి తన వేతనంలో 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని 33 శాతం పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని చెప్పారు. ఉద్యోగికి చివరి వేతనంలో సగభాగం పెన్షన్‌గా ఇస్తారన్నారు. ఉద్యోగి ఎలాంటి చందా చెల్లించిన అవసరం లేదని అందువల్ల ఓపిఎస్ మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి పలు సందర్భాల్లో సిపిఎస్ ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ దానిని రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తున్నాయని అదే విధంగా జగన్మోహన్ రెడ్డి కూడా వెంటనే సిపిఎస్ ను రద్దుచేసి ఒపిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు పెన్షన్ పథకం వర్తిస్తున్నప్పుడు ఉద్యోగులకు లేకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సి. లింగమయ్య, గౌరవ అధ్యక్షులు ఎస్‌వివి. రమణయ్య ,ఉపాధ్యక్షులు ఆర్. రామప్ప చౌదరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ ,జిల్లా కార్యదర్శి రవికుమార్, సంజీవ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడుతో పాటు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్‌లో శ్రీశాన్వి ప్రతిభ

శింగనమల : అనంతపురం గుత్తి రోడ్డులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్న శ్రీశాన్వి రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల జిఎం రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆదివారం విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిల్ అండర్-13 విభాగంలో 3-0 స్కోర్‌తో ప్రథమ స్థానం సాధించి స్టేట్ ఛాంపియన్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఇఒ ప్రతాపరెడ్డి, ఎజిఎం శంకర్‌నారాయణ, ప్రిన్సిపాల్ భాను, స్కూల్ యాజమాన్యం, అధ్యాపక అధ్యపకేతర బృందం పాల్గొన్నారు.

నేడు కుళ్లాయిస్వామి ఆలయ హుండీ లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గ్రామంలో వెలిసిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం ఆలయ ఆవరణంలో గ్రామపెద్దల సమక్షంలో లెక్కించనున్నట్లు కార్యనిర్వహణ అధికారిణి శోభ, కమిటీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఇప్పటికూ 8,636 కిలోల చక్కెరను విక్రయించగా రూ.3,11,004 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

బాల్యంపై బ్యాగుల భారం



విద్యార్థుల బ్యాగులు చూస్తే పెద్దలకే భయం వేయడం ఖాయం. బరువైన స్కూల్ బ్యాగులతో బడులకు వెళ్లే విద్యార్థులను చూస్తున్నాం. అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాలు సంచుల మోతతో పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పాఠశాల యాజమాన్యాలు వారి స్వార్థం కోసం టెస్టు పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు వర్క్ బుక్స్ పేరుతో పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచే నడుము నొప్పి, కండరాల బలహీనత, మెడ, భుజాల నొప్పితో బాధపడుతున్నారు. ఇలా పలు రుగ్మతుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు. భారీ పుస్తకాల సంచులను మోస్తూ 68 శాతం బాలలు వెన్ను నొప్పిని ఎదుర్కొంటున్నారని ఓ సర్వేలో తేలింది. ముందు వెన్నునొప్పితో ప్రారంభమై ఆ తరువాత గూనిగా మారుతుందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
పుస్తకాల బరువు తగ్గాలంటున్న వైద్యులు
అమలుకు నోచుకోని నో బ్యాగ్ డే

ప్రజాశక్తి-హిందూపురం

బాల్యంపై బండరాళ్లుగా మారుతున్న బ్యాగులు చూస్తే పెద్దలకే భయం వేయడం ఖాయం. అంతంత బరువులు వారు ఎలా మోస్తారో... ఒక్కోసారి తలుచుకుంటేనే బాధవేస్తుంది. హమాలీ పని చేస్తున్నట్లు బరువైన స్కూల్ బ్యాగులతో బడులకు వెళ్లే విద్యార్థులను చూస్తున్నాం. అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాలు సంచుల మోతతో పాటు పాఠశాలల్లో సరైన సదుపాయాలు లేక పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు, ఇటు పాఠశాల యాజమాన్యాలు వారి స్వార్థం కోసం టెస్టు పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు వర్క్ బుక్స్ పేరుతో పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచే నడుము నొప్పి, కండరాల బలహీనత, మెడ, భుజాల నొప్పితో బాధపడుతున్నారు. అలసటతో బడి నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సరికే నీరసపడిపోతున్నారు. ఇలా పలు రుగ్మతుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు. పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపంగా మారనుంది. ఉదాహరణకు 1వ తరగతి విద్యార్థికి సుమారు 3 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అంటగడుతున్నాయంటే పుస్తకాల మోత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భారీ పుస్తకాల సంచులను మోస్తూ 68 శాతం బాలలు వెన్ను నొప్పిని ఎదుర్కొంటున్నారని ఓ సర్వేలో తేలింది. 7 సంవత్సరాల నుంచి 13 ఏళ్లలోపు వయసు గల 2500 మంది విద్యార్థులపై అసోచామ్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ నిజం వెలుగు చూసింది. ముందు వెన్నునొప్పితో ప్రారంభమై ఆ తరువాత గూనిగా మారుతుందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రభుత్వం స్పందించేనా...?

ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల్లో దాదాపు 4540 పాఠశాలలు ఉండగా ఇందులో సుమారు 2,67,317 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పిల్లల వయసుకు మించి పుస్తకాల బరువు మోయకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా మానవ మనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 1993లో మస్‌పాల్ కమిటీని నియమించింది. ఆ కమిటీ పిల్లల సామర్థ్యానికి మించి బరువులు మోయకూడదనే నివేదిక ఇచ్చింది. దీనిపై 2006లో కేంద్రం చట్టం తీసుకొచ్చింది. పిల్లల బరువులో 10 శాతం బరువు ఉన్న పుస్తకాల కంటే ఎక్కువ మోయకూడదని ఆదేశించింది. కానీ పాఠశాలలు ఇవేవీ పట్టించుకోవడం లేదు. 10 శాతం బరువు కన్నా ఎక్కువ బరువును మోస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అమలుకు నోచుకోని నో బ్యాగ్ డే

రాష్ట్ర ప్రభుత్వం 2019 విద్యాసంవత్సరం నుంచి ఒక నూతన పథకానికి శ్రీకారం చుట్టినా అది అమలుకు నోచుకోలేదు. ప్రతి నెల 1వ, మూడవ శనివారం నో బ్యాగ్స్‌డే పద్ధతిని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇది ఎక్కడా అమలుకు నోచుకున్న దాఖలాలు లేవు. చట్టం తీసుకోచ్చిన మొదటి నుంచి ఏ పాఠశాల నిర్వాహకులు అమలు చేయలేదు. అయితే పట్టణంలో ఒక పాఠశాల దీనిని అమలు చేసి, ప్రతి శనివారం నో బ్యాగ్ డేను అమలు పరచింది. ఎవరూ అమలు చేయక పోవడంతో వారు సైతం అమలు చేయలేదు.

పుస్తకాల బరువు తగ్గించాలి

పాఠశాలలో అవసరం ఉన్న మేరకే పుస్తకాలు వినియోగించాలి. ప్రతిరోజు విద్యార్థులు అన్ని పుస్తకాలు తీసుకెళ్లకుండా అవసరం మేరకే తీసుకెళ్లేలా పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలి. పుస్తకాల బరువు మోయడం ద్వారా పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి నీరసించిపోతున్నారు. చిన్న వయస్సులోనే అనేక రుగ్మతలకు గురవుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

మారుతీ శ్రీనివాస్,
యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

విద్యార్థులపై భారం తగ్గించాలి

పాఠశాలల విలీనం ద్వారా దూరం పెరిగే అవకాశ ఉంది. ఇంత దూరం విద్యార్థులు పుస్తకాల బరువు మోయాలంటే ఇబ్బందికర పరిస్థితే. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేలా ఆయా పాఠశాలల్లో ర్యాక్స్ ఏర్పాటు చేసి టెక్స్ట్‌బుక్స్ అన్నీ పాఠశాలల్లోనే ఉంచుతూ, హోంవర్క్ బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా చర్యలు చేపడితే విద్యార్థులపై కొంత భారాన్ని తగ్గించవచ్చు. దీంతో పాటు ప్రవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు అవసరం లేకున్నా పుస్తకాలను తప్పనిసరి కొనాలని నిబంధలను విధించి విక్రయిస్తున్నాయి. ప్రభుత్వం సూచించిన పుస్తకాలనే పాఠశాలల్లో వినియోగించే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

బాబావలి,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పిల్లల ఆరోగ్యంపై ప్రభావం

చిన్న వయసు పిల్లలు ఎక్కువ బరువు మోస్తే వారి వారి శరీరాకృతి దెబ్బతినే అవకాశం ఉంది. భుజాలు, మెడ, నడుము భాగాల్లో నొప్పి కలుగుతుంది. నీరసంగా అనిపిస్తుంది. విసుగు, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురవుతాయి. పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా విద్యాబోధన ఉండాలి. ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ అఫ్తాబ్,
చిన్న పిల్లల వైద్య నిపుణులు

తరువాతి వంతు శంకర నారాయణదేనా.. ?

హిందూపురానికి బిసి వచ్చాక పెనుకొండ మార్పు తథ్యమా..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరకొస్తున్న కొద్ది రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు అభ్యర్థులను సెట్ చేసుకునే పనిలోనున్నాయి. ఈ విషయంలో అధికార వైసిపి మరింత ముందుగా అడుగులేస్తున్నట్లు కనిపిస్తోంది. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తను దీపికాని ఇటీవలనే నియమించిన విషయం తెలిసిందే. అంతకు ముందువరకు ఉన్న మహమ్మద్ ఇక్బాల్‌ను మార్చివేశారు. కురబ సామాజిక తరగతికి చెందిన దీపికను హిందూపురం సమన్వయకర్తగా నియమించడంతో హిందూపురం పార్లమెంటు పరిధిలో దీనికి అనుగుణంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సామాజిక కూర్పులు మారనున్నట్లు ప్రచారం సాగుతోంది. హిందూపురం పక్కనే వున్న పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో కురబ సామాజిక తరగతికి చెందిన శంకర నారాయణ ఉన్నారు. పార్టీ ప్రారంభం నుంచి జిల్లా కన్వీనర్‌గా ఉంటూ వస్తున్నారు. ఆ తరువాత మంత్రిగానూ ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో ఆయనను పదవి నుంచి తప్పించారు. ప్రస్తుతం సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగానూ ఉంటున్నారు. అయితే స్థానికంగా నేతలకు, ఆయనకు మధ్య విభేదాలు తారా స్థాయిలోనున్నాయి. నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెళ్లిన సమయంలో శంకరనారాయణపై చెప్పులతో దాడి చేశారు. వ్యతిరేకత తీవ్రంగా ఉండటంతోపాటు, పక్క నియోజకవర్గం హిందూపురానికి కురుబ సామాజిక తరగతికి చెందిన వారినే సమన్వయకర్తగా నియమించడంతో ఈయన మార్పు తథ్యమయ్యే సూచనలు కనిపిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. కొత్త వ్యక్తిని ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. సత్యసాయి జిల్లా వాసే అయిన కర్నాటకలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకునే వ్యక్తిని ఇక్కడికి బరిలో దింపే ఆలోచన సాగుతున్నట్టు కూడా తెలుస్తోంది. బాబురెడ్డి అనే వ్యక్తిని పెనుకొండ అసెంబ్లీ స్థానానికి తీసుకొస్తే ఎలాగుంటుందని అధిష్టానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. బిసికి హిందూపురంలో చోటు కల్పించిన నేపథ్యంలో పెనుకొండలో మరొకరని తీసుకురావడం ద్వారా అక్కడున్న పార్టీ వివాదాలకు చెక్ పెట్టినట్టవుతుందని కూడా భావిస్తున్నట్లు సమాచారం. అయితే పార్టీకి విధేయుడిగానున్న శంకర నారాయణకు ఏ రకంగా సర్దుబాటు చేస్తారన్నది కూడా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వేరే పదవుల్లో ఆయనకు చోటు కల్పిస్తారా లేదా అన్నది కూడా చూడాల్సుంది. ఇలా ఒక్కొక్క నియోజకవర్గంపైనా పార్టీ అధిష్టానం దృష్టి సారిస్తూ మార్పులు, చేర్పులు చేసేందుకు సిద్ధపడినట్లు కనిపిస్తోంది. కొన్ని నెలల్లో వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికి అన్ని నియోజకవర్గాల్లోనూ సర్దుబాట్లు చేసే ఆలోచన ఇప్పటి నుంచే చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇంకా ఎన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి మార్పులుండనున్నాయోనన్న భయం ఎమ్మెల్యేల్లోనూ కనిపిస్తోంది. ఇప్పటికే కొంత మంది నేరుగానే మార్పుల అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

సగానికిపైగా నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులు తీసుకొచ్చే ఆలోచనలో అధిష్టానమున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై ఇప్పటికే ఐ ప్యాక్ సంస్థ కూడా నాయకుల పనితీరుతోపాటు, కొత్త నాయకులు ఎవరైతే బాగుంటుందన్న దానిపై సర్వే చేయించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో మార్పులు, చేర్పులు వైసిపిలో మరింత జోరుగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పట్టణాభివృద్ధే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున

ప్రజాశక్తి - గుంతకల్లు

గుంతకల్లు పట్టణాభివృద్ధితోపాటు ప్రజల అత్యవసర సమస్యలైన తాగునీరు ,పారిశుధ్యంతో పాటు ప్రాధాన్యత గల ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే, పాలక వర్గం సహకారంతో తగిన చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున అన్నారు. మునిసిపాలిటీకి సంబందించిన పలు అంశాలపై ప్రజాశక్తి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పట్టణ ప్రజలకు తాగునీరు ఆరు రోజులకు ఒకసారి ఇస్తున్నారు. అదే విధంగా శివారు కాలనీల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మీ సమాధానం.?

కమిషనర్: ధర్మవరం నుంచి నేను బదిలీపై వచ్చిన సమయంలో తాగునీరు ఆకుపచ్చ రంగుతో వస్తుండగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లలో ఫిల్టర్ బెడ్లను సరిచేయించి శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నాము. ఇప్పటికే ఇంజనీర్లతో సమీక్షలు చేసి పట్టణంలోని తాగునీరు పైపు లైన్లు, ఇంటర్ కనెక్షన్లు సరిచేసి అతి త్వరలో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని మూడు రోజులకు ఒకసారి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అమృత్ ఫేస్ 2 కింద పైపు లైన్ల ఏర్పాటు జరుగుతోంది. ప్రజలు కూడా తాగునీరు వృథా చేయకుండా పొదుపుగా వాడాలి.పట్టణ శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం.

ప్ర: మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు చేపడున్నారు.?

క : మున్సిపాలిటీలో 250 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు.పట్టణంలో క్లాప్ ప్రోగ్రాం ద్వారా ఇంటింటా చెత్త సేకరణ కొంత మేరకు సక్రమంగా జరగడం లేదు. కార్మికులు సచివాలయం శానిటరీ సిబ్బంది మధ్య సమన్వయం లోపం కారణంగా పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు.ప్రస్తుతం వర్షాకాలం అయినందున అదనపు కార్మికులను తీసుకుని మురుగు కాలువలలో పూడిక తీత పనులు చేపట్టాం. ఇప్పటికే 26 క్లాప్ ఆటోలు ఉన్నాయి. ప్రతి వెయ్యి ఇళ్లకు ఒక చెత్త సేకరణ ఆటోలు ఏర్పాటు చేస్తాం. ప్రజలు కూడా చెత్తను ఇంటి వద్దకు వచ్చిన ఆటోకు అందించాలి.

గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున

ప్ర: నిషేధిత ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు ?

క : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఆ క్రమంలో పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్ర : పట్టణంలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

క : దోమల నివారణకు చర్యలు చేపట్టాం.ఇప్పటికే రూ. 6.50 లక్షలు వెచ్చించి 50 చెత్త సేకరణ ట్రాలీలు,6 పెద్ద ఫాగింగ్ మిషన్లు,16 పవర్ స్ప్రే మిషన్లు కొనుగోలు చేసాం. ప్రతి వార్డులో ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రజలు కూడా దోమల నుంచి రక్షణకు దోమతెరలు వాడాలి. కుళాయి నీరు కాచి వడబోసి తాగాలి.

ప్ర : కూరగాయల మార్కెట్టు లో మున్సిపల్ స్థలంలో కొందరు షెడ్లు వేసుకుని ఇతరులకు లీజులకు ఇచ్చి సొమ్ము చేసుకుని మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

క : కూరగాయల మార్కెట్టులో ఒకటిన్నర ఎకరా స్థలం అన్యాక్రాంతం అయినట్లు మా దృష్టికి వచ్చింది. ఛైర్‌పర్సన్ తో చర్చించి.అక్కడ నూతన భవనాలు ఏర్పాటు చేసి మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకుంటాం.

అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో కార్మికుడు మృతి

తాడిపత్రి రూరల్ : మండలంలోని అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమలో ఓ కార్మికుడు అకస్మాత్తుగా సొమ్మసిల్లి కింద పడి మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన హుస్సేన్ (47) అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో పనిచేస్తున్నారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో నీళ్లు తాగుతుండగా ఒక్కసారి సొమ్మసిల్లి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురానికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు గ్రామీణ ఎస్ఐ గౌసహమ్మద్ తెలిపారు. అతనికి భార్య హజరున్, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి

అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో మృతిచెందిన కార్మికుని కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామ్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుని కుటుంబంలో ఒకరికి పరిశ్రమలో ఉద్యోగం ఇవ్వాలని, కుటుంబానికి ఆర్థికంగా సహకరించి ఆదుకోవాలని కోరారు.

అల్ట్రాటెక్‌లో మృతిచెందిన హుస్సేన్

అభివృద్ధికి నోచని గూగూడు

తిష్టవేసిన సమస్యలు - ఇరుకైన రోడ్లు..రోడ్డుపైనే మురుగునీరు
శిథిలమైన కోనేరు - 19న ఉత్సవాలు..ప్రారంభంకాని ఏర్పాట్లు

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి సన్నిధి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తయినా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే అన్న చందంగా ఉంది. మరోవైపు గూగుడును పర్యాటక కేంద్రం చేస్తామన్న నాయకుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని స్థానికులు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1-8-1920లో కుళ్లాయిస్వామి ఆలయం నిర్మాణం చేపట్టి 2-6-1922లో పూర్తి చేశారు. వందేళ్లు పూర్తి చేసుకున్న పురాతన ఆలయాల్లో కుళ్లాయి స్వామి క్షేత్రం కూడా చేరింది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామి ఆలయాలు పక్కపక్కనే ఉంటూ మత సామరస్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. ఈ జంట ఆలయాల ముందు గ్రామ దేవత పెద్దమ్మ దేవాలయం కూడా ఉంది. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మొదట హనుమాన్ చాలీసా చదివి, అటుపై కుళ్లాయిస్వామికి చక్కర చదివింపులు ఉంటాయి. తర్వాత పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. ప్రతి ఏటా నిర్వహించే మొహర్రం వేడుకలకు కుళ్లాయిస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా కర్నాటక, తమిళనాడు, గోవా, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. మొహర్రం వేడుకల్లోనే కాకుండా ప్రతి గురు, శుక్ర, ఆదివారాల్లో స్వామివారికి కందూరి వేడుకలు నిర్వహించేందుకు భక్తులు వస్తారు. స్వామికి భక్తులు చెల్లించే కానుకల ద్వారా రూ.కోట్లలో ఆదాయం ఉంది. అయితే భక్తులకు సౌకర్యాలు కల్పించిన పాపానపోలేదు. కనీసం శాశ్వత మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడం బాధాకారం. గ్రామంలో డ్రెయినేజీ కాలువలు లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి చెత్తాచెదారం నిలిచి భక్తులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది. భక్తులు విడిది చేయడానికి దేవాదాయ శాఖ భవనాలు లేవు. భక్తులు స్నానమాచరించే కోనేరు బావి పూర్తిగా శిథిలమైంది. ఆలయ పరిసరాల చుట్టూ ఉన్న ఇళ్లను తొలగించి భక్తులకు సౌకర్యవంతంగా రోడ్ల వెడల్పు చేస్తామని అధికారులు చెప్పడమే తప్ప చేసింది శూన్యమని భక్తులు వాపోతున్నారు. మొహర్రం వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా నాయకులు భారీగానే తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అయినా భక్తుల ఇబ్బందులను గుర్తించిన దాఖలాలు లేవు. ఈనెల 20వ తేదీ నుంచి గూగూడు కుళ్లాయిస్వామి వేడుకలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో కనీసం ఈసారైనా కనీస మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న కుళ్లాయిస్వామి కోనేరు

గూగూడులో ఇరుకైన రోడ్లతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పేరుకుపోయిన చెత్తాచెదారం

గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్య

మృతిచెందిన శివలక్ష్మి

గుత్తి : మండలంలోని కొజ్జేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రాముడు కుమార్తె శివలక్ష్మి (21) కొంతకాలంగా దిగాలుగా ఉండేది. గతంలో తన సోదరి, ఆరునెలల క్రితం తల్లి మృతి చెందారు. వారి మరణంతో శివలక్ష్మి మనోవేదనకు గురైంది. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్టార్టర్లు, వైర్లు చోరీ

బొమ్మనహాల్ : మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో వేదవతి నదిఒడ్డున ఉన్న బోరు బావులు వద్ద 30 మంది రైతులకు సంబంధించిన విద్యుత్ వైర్లు, స్టార్టర్లు శనివారం రాత్రి చోరీకి గురైనట్లు సర్పంచి కావలి వృతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లకు సంబంధించిన వైర్లను అపహరించుకెళ్లినట్లు తెలిపారు. ఫలితంగా సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ఈమేరకు బాధిత రైతులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆలయంలో వెండి కవచం..

బుక్కరాయసముద్రం : మండలంలోని రెడ్డిపల్లిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రెడ్డిపల్లి గ్రామంలో వెలసిన పెద్దతల్లి ఆలయంలో అమ్మవారి ముఖ కోశానికి అలంకరించిన వెండి కవచాన్ని చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ వెండి కవచం 75 తులాలు ఉంటుందన్నారు. ఉదయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె : మండల పరిధిలోని తలగాచపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మంపేటకు చెందిన కృష్ణారెడ్డి, నారప్పరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మంపేట నుంచి గార్లదిన్నెకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా తలగాచిపల్లి క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన ఐచర్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఇరువురినీ అనంతపురంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా డాక్టర్ శాంతిప్రియ

లయన్స్ క్లబ్ పామిడి అధ్యక్షురాలుగా డాక్టర్ ఎం.శాంతిప్రియను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి : లయన్స్ క్లబ్ పామిడి అధ్యక్షురాలుగా డాక్టర్ ఎం.శాంతిప్రియ ఎన్నికయ్యారు. గుత్తి పట్టణంలో శాంతి ప్రియా ఆసుపత్రిని నిర్వహిస్తూ ఎన్నో సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. వాటిని గుర్తించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఎం.శాంతి ప్రియా ను పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకున్న ఆమెను సోమవారం శాంతి ప్రియ హాస్పిటల్ లో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబుతోపాటు పలువుర ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాంతి ప్రియ హాస్పిటల్ సిబ్బంది అశోక్, రవి, మైనుద్దీన్, మాధవి, మంజుల, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'కాలవ'కు సిఎంను విమర్శించే అర్హత లేదు..
విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాణితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి కృష్ణాజిల్లాల ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు లేదని విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. టిడిపి హయాంలో బిటిపి వద్ద బహిరంగ సభ పెట్టించి దోచుకున్న ఘనత కాలవకే దక్కిందన్నారు. అలాంటి వాడు సిఎం జగన్‌ను విమర్శించే అర్హత ఎక్కడుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాలవ శ్రీనివాసులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.

తప్పుడు హామీలతో మోసం చేస్తున్న సిఎం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సిఎం జగన్ తప్పుడు హామీలతో పదే పదే ప్రజల్ని మోసం చేస్తున్నాడని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేపాక్షి నాలెడ్జి హబ్ భూములపై పదేపదే కుంభకోణాలు చేసి ఏవిధంగా డబ్బులు దండుకుంటున్నారో అదేవిధంగా పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో జీడిపల్లి, బిటిపి పథకం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. రెండేళ్ల కిందట రాయదుర్గంలో జగన్ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, నిన్నటి కళ్యాణదుర్గం సభలో రూ.208 కోట్లు విడుదల చేస్తానని ప్రకటించడం విడ్డురంగా ఉందన్నారు. 2021 జులై 8న రాయదుర్గం సభలో జీడిపల్లి, బిటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం భూసేకరణను 60 రోజుల్లో పూర్తి చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. తీరా రెండేళ్ల గడిచాక భూసేకరణ పనులకు రూ.208 కోట్లు ప్రకటిస్తే ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి 'కాళ్లకాలిన పిల్లిలాగా' చప్పట్లతో ఆనందించడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు చెప్పే మాటలకు, వాస్తవానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు 3 నెలల్లో రూ.150 కోట్లతో బిటిపికి కృష్ణాజలాలు తెస్తానని చెప్పిన కల్లి బొల్లి మాటలు మర్చిపోయావా అంటూ విప్ కాపును నిలదీశారు. నాలుగేళ్ల తర్వాత మంత్రి ఉషశ్రీ చరణ్, కాపు రామచంద్రారెడ్డి మొద్దు నిద్ర లేచినట్లుందన్నారు. రూ.208 కోట్లతో భూసేకరణ ఎప్పుడు ప్రారంభిస్తారో, బిటిపి ఎత్తిపోతల కాలువ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఈ పథకంపై మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికు కనీస అవగాహన లేదన్నారు. జగన్‌రెడ్డి పర్యటనలో తెల్లవారుజాము నుంచి బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు సరైన అల్పాహారం కూడా అందించలేని దద్దమ్మ ప్రభుత్వమిదని దుయ్యబట్టారు. జగన్ సభకు బస్సుల్లో తరలించిన డ్వాక్రా మహిళలకు అట్ట ముక్కల్లో భోజనం పెట్టిన చెత్త సర్కారును ఏమనాలో అర్థం కావడంలేదన్నారు. అంతేగాకుండా కర్ణాటక మద్యం ఏరులై పారిందన్నారు. జగన్ రెడ్డి బ్రాండ్లపై నమ్మకం లేక కర్ణాటక రాష్ట్రం నుండి వేల కొద్దీ టెట్రా ప్యాకెట్లలో మద్యాన్ని సరఫరా చేశారన్నారు. గుట్టలుగా ఖాళీ ప్యాకెట్లు దర్శనమిచ్చాయంటేనే వైసిపి నాయకులు ఏ స్థాయిలో మద్యాన్ని సరఫరా చేసి ఉంటారో ఊహించవచ్చన్నారు. దగాకోరులంతా కలిసి ప్రజలసొమ్ముతో నిర్వహించిన దండగమారి సభగా కాలవ అభివర్ణించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు సన్నన్న, ఇనాయత్, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మహబూబ్‌బాషా, ఎస్సీ సెల్ మల్లి, శీనా, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

చైన్ స్నాచర్ అరెస్ట్

అనంతపురం క్రైం : మహిళ మెడలో చైన్ దొంగిలించిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసి రూ.40 వేల విలువజేసే చైన్ ను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

ఎకరాకు రూ.10వేలు సాగుసాయం చేయాలి

యాడికి : ప్రతి రైతుకూ తప్పనిసరిగా ఎకరాకు రూ.10వేల సాగుసాయం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి డి.చిన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ సీనియర్ నాయకులు జూటూరు మహమ్మద్ రఫీ నివాసంలో తాడిపత్రి నియోజకవర్గ రైతుసంఘం మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో ప్రతి రైతూ రుణభారంతో బాధలు పడుతున్నారన్నారు. అంతేగాకుండా రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. అలాగే రైతులు, కౌలు రైతులకు పంట రుణాలను రూ.2 లక్షల వరకూ మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తేవాలని, అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఉపకరణాలను 90శాతం సబ్సిడీతో అందించాలని, 50 సంవత్సరాలు పైబడిన రైతులకు ప్రతినెలా రూ.10 వేల పెన్షన్ డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించాలని ఆలోచన ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఈనెల 10, 11వ తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 17, 18, 19వ తేదీల్లో నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి 24న కలెక్టరేట్ల వద్ద, ఆగస్టు 7న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, నాయకులు వెంకటరాముడు యాదవ్, శ్రీరాములు, ఓబిరెడ్డి, జుటూరు మహమ్మద్ రఫీ, వడ్డే రాముడు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణకు సిద్ధం

ప్రజాశక్తి-ఉరవకొండ

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులుగా ఉన్న తనతోపాటు వీరన్న భూకబ్జాలకు పాల్పడ్డామని ఇటీవల వైసిపి నుంచి సస్పెండ్‌కు గురైన మధుసూదన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేయడం తగదని బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కెవి.రమణ ఖండించారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉరవకొండతోపాటు అనంతపురం, కర్నాటక ప్రాంతాల్లో నువ్వు చేసిన అవినీతి, దౌర్జన్యకాండపై సీఐడీ విచారణకు సిద్ధమా.. అని ప్రశ్నించారు. తాము భూకబ్జాలకు పాల్పడినట్లు రుజువు చేస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. అనంతపురం రూరల్ పరిధిలోని 28 సర్వే నెంబర్‌లోని భూమి తమ పేరుతో 2008లో ప్రభుత్వం డీ పట్టా మంజూరు చేసిందన్నారు. ఈ భూమిపై హక్కు, అనుభవం కలిగి ఉన్నామని వివరించారు. అయితే కొంతమంది దుష్టశక్తుల మాటలు విని ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకూ మీరు ఎన్ని ఆరోపణలు చేసినా మీ తండ్రి రాకెట్ల నారాయణరెడ్డిపై ఉన్న గౌరవంతో ఊరుకున్నామన్నారు. ఇకపై సహించేది లేదన్నారు. ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోకపోతే ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, ఎంపిపి చంద్రమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, మాజీ ఎంపిపి ఏసీ ఎర్రిస్వామి, మాజీ జడ్పీటీసీ తిప్పయ్య, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఓబన్న, జోగి భీమా, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కెవి రమణ

కార్యక్రమానికి తరలివచ్చిన ముస్లిములు

ముగిసిన జిల్లా ముస్లిముల కలయిక

నార్పల : మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాలోని ముస్లిముల జోడు (కలయిక) ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యిమంది వరకూ తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకూ బోధనలు జరిగాయి. ఈ సందర్భంగా బెంగళూరు నుంచి మౌలానా షామీర్ హాజరై మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ దైవస్మరనే మోక్షమార్గం అన్నారు. జిల్లా బాధ్యులు అమీర్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఏడాది జిల్లాలోని ఏదో ఒక మండలంలో జిల్లా ముస్లిముల కలయికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఇక్కడ చేసినట్లు వివరించారు. అనంతరం ఈద్గా మసీదు పక్కన నూతనంగా నిర్మించిన మదరసాను స్థానిక ముస్లిం మతపెద్దలతో పాటు జిల్లా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్ బాషా, సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

యాడికి : మండల కేంద్రంలో 1983-84లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం చౌడేశ్వరి కళ్యాణ మండపంలో కలిశారు. ఇందులో భాగంగా అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధుల కారణంగా ఉన్నతస్థాయికి చేరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకుల రాజు, బలరాం రెడ్డి, నాగ రంగయ్య, బాల రమేష్, జానపాటి ప్రసాదు, చింత బాల, సుబ్బారెడ్డి, జూటూరు చంద్రశేఖర్ రెడ్డి, చింతా మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల కేంద్రంలో వెలసిన భగవాన్ సత్యసాయి భజన మందిరంలో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా సంస్థల కన్వీనర్ డాక్టర్ రామచంద్రమూర్తి, మహిళా కోఆర్డినేటర్ డాక్టర్ శైలజామూర్తి మాట్లాడుతూ సత్యసాయి బాబా 20 శతాబ్ధంలో ప్రసిద్ధి చెందిన గురువు, వేదాంతని భగవంతుని అవతారమన్నారు. ఈయన మహిమల పట్ల చాలామందికి అపారమైన విశ్వాసం ఉందన్నారు. ఇందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లో 1200 సత్యసాయి కేంద్రాలు ఉన్నాయన్నారు. 10 కోట్ల మంది వరకూ బాబాను కొలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ జిల్లా కోఆర్డినేటర్ గీతా, స్పిరిచువల్ కోఆర్డినేటర్ లింగమయ్య, ఐటీ కోఆర్డినేటర్ సాయితేజ, మెడికల్ కోఆర్డినేటర్ ధనుంజయ, సత్యసాయి సేవాసమితి మండల కన్వీనర్ ఎం.రామ్మూర్తి, సత్యసాయి కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, దోనతిమ్మ రాయుడు, ఓంప్రకాష్, సాయిరాం, ఆవులన్న సుబ్బన్న, సరోజమ్మ, యల్లమ్మ, పూర్ణిమ, లక్ష్మీకాంతమ్మ, తిప్పమ్మ, లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యసాయి జిల్లా సంస్థల ప్రతినిధులు

వైసిపి నేత 'బేడల' ఇంట్లో సంబరాలు

ప్రజాశక్తి-గుత్తి

వైసీపీ సీనియర్ నాయకులు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ బేడల వెంకటరాముడు జన్మదిన వేడుకల్లో భాగంవగా ఆదివారం పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో ప్రజాప్రతినిధులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కోసం పంచిపెట్టారు. ఈ సందర్భంగా బేడల వెంకటరాముడు, సతీమణి, వన్నెదొడ్డి సర్పంచి లక్ష్మీదేవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, నాయకులు, ఎం. రంగస్వామి, బేడల రమేష్, జీపు రమణ, నారాయణస్వామి, లక్ష్మీరెడ్డి, నారాయణ, కౌన్సిలర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బేడల వెంకటరాముడు దంపతులను సన్మానిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

వైసిపి చేసింది శూన్యం

ప్రజాశక్తి-అనంతపురం

నాలుగేళ్ల వైసిపి పాలనలో అనంతపురంలో చేసిన అభివృద్ధి శూన్యమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విమర్శించారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆశయ సిద్ధాంతాలను వివరిస్తూ ఆదివారం నగరంలో జనసేన జయభేరి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నగరంలోని తాడిపత్రి బస్టాండ్ వద్ద ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో టి.సి.వరుణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అనంతలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధిని స్థానిక నాయకులు తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిగా చెప్పుకుంటున్నారన్నారు. వైసిపి నాయకులు ఎన్నికల సమయంలో అనంత అభివృద్ధికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికే అర్హులైన వికలాంగులు వితంతువులు వద్దులకు పార్టీల పక్షపాతంతో పింఛన్లు రద్దు చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అభివద్ధి జరగాలంటే అది జనసేనతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాప్తాడు ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, తాడిపత్రి ఇన్‌ఛార్జి శ్రీకాంత్‌రెడ్డి, అనంతపురం జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్‌రెడ్డి, అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిలు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు సంజీవరాయుడు, రాపా ధనుంజయ్, చొప్ప చంద్ర, కిరణ్‌కుమార్, గౌతమ్‌కుమార్, వీరమహిళలు జెక్కిరెడ్డి పద్మావతి, అనసూయ, మంజుల, డోనే సరిత, తదితరులు పాల్గొన్నారు.

జనసేన జయభేరిలో జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న జనసేన జయభేరి జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రజకుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే సమయం ఆసన్నమైనదని, కలసికట్టుగా ఉద్యమాలకు తరలిరావాలని ఎపి రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు లింగమయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన రజక వృత్తిదారుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రజక వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న రజకులకు ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమవుతున్నాయన్నారు. ప్రస్తుతం పెద్దవడుగూరులో రజకుల కోసం ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. దీన్ని పూర్తిస్థాయిలో ఖండిస్తున్నామన్నారు. రజకులకు కేటాయించిన స్థలాలను ప్లాట్లుగా వేసి ఇళ్లనిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక సామాజిక భద్రతా చట్టాన్ని తీసుకొచ్చి రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం ఈనెల 21న నిర్వహించనున్న రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్రసదస్సుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కార్యదర్శి నాగప్ప, మండల నాయకులు కుళాయిస్వామి, రామాంజనేయులు, మల్లికార్జున, సుంకన్న, పాపన్న, పుల్లయ్య, సుధాకర్, కార్తీక్, తిరుపాలు, ఈశ్వరమ్మ, రంగమ్మ, అంజలి, అంజి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేస్తున్న రజక సంఘం నాయకులు

రేపు నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : పీఏబీఆర్ తాగునీటి పైపులైనుకు జల్లిపల్లి టోల్గేట్ వద్ద ప్రధాన పంపింగ్ లైన్ కు లీకేజీ ఏర్పడటంతో మరమ్మతులు చేపడుతున్నట్లు సూపరెంటెంట్ ఇంజినీర్ సతీష్ చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు కావున మంగళవారం నాడు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు నగర ప్రజలు ఈ అంశాన్ని గుర్తించి మున్సిపల్ కార్పొరేషన్ తో సహకరించాలని కోరారు మంగళవారం రోజు సాయంకాలం తాగునీటి సరఫరా అయ్యే కాలనీలకు నీటి సరఫరా జరగదని అన్నారు

23న బిసి ప్రజా సింహగర్జన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విజయవాడలో ఈ నెల 23వ తేదీ జరిగే బిసి ప్రజా సింహగర్జనను విజయవంతం చేయాలని జిల్లా యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం జిల్లా నాయకుడు వరప్రసాద్ ఆధ్వర్యంలో పుట్టపర్తి బస్టాండ్‌లో ప్రజా సింహగర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త పుంగనూరు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఈ మహా సింహగర్జన జరుగుతుందన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా జరిగే చేపట్టనున్న ఈ మహాగర్జనలో బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యాదవులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి తగిన కార్యాచరణను ఆ గర్జనలో ప్రకటిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ నాయకులు దయ్యాల ఉమాపతి యాదవ్, కిరణ్‌యాదవ్, అంగడి రాజాయాదవ్, వెంకటేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.